సాక్షి

కాకినాడ

శుక్రవారం | 27 | డిసెంబర్ | 2024



ఎవరా పెద్దాయన..!

కరప మండలం విజయరాయుడుపాలెంలో కోడిపందేల బరి ఏర్పాటుపై సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్న ఫోను సంభాషణ చర్చనీయాంశంగా మారింది.


10లో



పాత నేరస్తులపై నిఘా

పాత నేరస్తులపై నిరంతరం నిఘా పెడుతున్నామని, దీనివలన మంచి ఫలితాలు వస్తున్నాయని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ తెలిపారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 9,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.35 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీ వరకూ ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్ నిర్వహించి, అభ్యంతరాలు స్వీకరిస్తామని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కులగణన వివరాలను గ్రామ/వార్డు సచివాలయాల్లో ప్రదర్శించామని, దీనిపై వచ్చే అభ్యంతరాలను వచ్చే నెల 6 వరకూ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారన్నారు. కులగణన తుది వివరాలను వచ్చే నెల 10న సచివాలయాల్లో ప్రదర్శిస్తామని తెలిపారు. కులగణనపై మూడు దశల్లో తనిఖీలుంటాయన్నారు. పేరు, ఆధార్ నంబర్, పుట్టిన తేదీ, వయస్సు, ఉపకులం, మరుగుదొడ్డి, తాగునీటి సౌకర్యాలు, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం వివరాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తారని వివరించారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్‌ఓ పరిశీలించి, ఆర్‌ఐకి నివేదిస్తారన్నారు. వీటిని ఆర్‌ఐ పునఃపరిశీలించి తహసీల్దార్‌కు రికమండ్ చేస్తారన్నారు. అనంతరం తహసీల్దార్, వీఆర్‌ఓ, ఆర్‌ఐల నివేదికలో వివరాలను పరిశీలించి, తుది ఆమోదం తెలిపి, ఆ వివరాలు భద్రపరుస్తామని తెలిపారు. ఈ వివరాల్లో కచ్చితత్వాన్ని పెంపొందించేందుకు సహాయ సాంఘిక సంక్షేమ అధికారులతో 50 మంది వివరాలను ర్యాండమ్‌గా తనిఖీ చేస్తామని, సోషల్ ఆడిట్‌ను కలెక్టర్, ఆర్‌డీఓలు పర్యవేక్షిస్తారని శ్రీనివాసరావు తెలిపారు.

తత్కాల్ ఫీజుతో అడ్మిషన్‌కు అవకాశం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ ఓపెన్ స్కూల్‌లో తత్కాల్ ఫీజుతో అడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పించారని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సాయి వెంకట రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందాలనుకునే వారు ఈ నెల 26 నుంచి 31వ తేదీలోపు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అడ్మిషన్ ఫీజుకు అదనంగా తత్కాల్ ఫీజు రూ.600 చెల్లించి అడ్మిషన్ పొందవచ్చన్నారు. ఇతర వివరాలకు సమీపంలోని పాఠశాలల్లో ఉన్న ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆదాయం పెంపుపై సమీక్ష

అన్నవరం: వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన నిర్ణయాలపై సిబ్బందితో చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వి.సుబ్బారావు గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధికారులు పలు సూచనలు చేశారు. వ్రత విభాగంలో మిగిలేది చాలా తక్కువని, అందువలన రూ.300 వ్రతం టికెట్టును రూ.500కు పెంచి, అందులో రూ.400పై 40 శాతం కమీషన్ పురోహితులకు, మిగిలిన రూ.వంద దేవస్థానానికి చెందేలా చూడాలన్న సూచన వచ్చింది. దీనివలన దేవస్థానానికి రూ.5.50 కోట్లు మిగులుతుందని అంచనా. అలాగే, వ్రతాల్లో ఉపయోగించే గావంచాలకు ఏటా రూ.60 లక్షల ఖర్చవుతోంది. దీనికి బదులు వ్రతంలో రాగి యంత్రం ఉంచి, అనంతరం దేవస్థానం తీసుకునేలా సూచన చేశారు. వ్రతాల్లో వాడే బియ్యం వేలం వేస్తే కూడా దేవస్థానానికి ఆదాయం వస్తుందనే సూచన వచ్చింది. డిజిటల్ పేమెంట్ల కోసం త్వరలో ఐదుచోట్ల కియోస్కులు పెట్టాలని, వాటి ద్వారా స్కాన్ చేస్తే వ్రతం, దర్శనం, ప్రసాదం టికెట్లు వచ్చేలా చూడాలని సూచన చేశారు. పలుచోట్ల స్కాన్ ద్వారా కానుకలు చెల్లించేలా ఈ–హుండీలు ఏర్పాటు చేయాలని కొంతమంది సూచించారు. ఈ సూచనలన్నీ క్రోడీకరించి నివేదిక తయారు చేయాలని, తరువాత దేవదాయ శాఖ కమిషనర్‌తో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని సమీక్షలో నిర్ణయించారు.

ఏపీ ప్రత్యేక రక్షణ దళం ప్రాంతీయ కార్యాలయం మార్పు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయాన్ని స్థానిక నారాయణపురంలోని నాగమ్మతల్లి గుడి వెనుక వైపునకు మార్చారు. దీనిని కమాండెంట్ కొండా నరసింహారావు, సహాయ కమాండెంట్ పీపీఎస్‌ఏడీ ప్రసాదరావు, డి.గంగరాజు, అధికారులు, సిబ్బంది గురువారం ప్రారంభించారు. కమాండెంట్ నరసింహారావు దంపతులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, సర్వమత ప్రార్థనలు చేశారు.

ఏలూరుకు నేడు ఏకసభ్య కమిషన్ రాక

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఎస్సీ ఉపవర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ శుక్రవారం ఏలూరు జిల్లాలో పర్యటించనుంది. జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎంఎస్ శోభారాణి గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. కమిషన్ చైర్మన్ విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా జిల్లా యంత్రాంగం, వివిధ ఉప కులాల సభ్యులు, సంఘాలతో సమావేశమై వినతులు స్వీకరిస్తారని వివరించారు.

సర్కారువారి సర్దుపోటు



- వినియోగదార్లకు కరెంటు షాక్
- సర్దుబాటు చార్జీల పేరిట వసూలు
- ఎన్నికల హామీని తుంగలో తొక్కిన కూటమి సర్కార్
- విద్యుత్ చార్జీల పెంపుపై నేడు వైఎస్సార్ సీపీ పోరుబాట
- అన్ని నియోజకవర్గాల్లో ఆందోళనలు

జిల్లాలో విద్యుత్ గణాంకాలు

గృహవినియోగదారులు	6,59,127
కమర్షియల్(వాణిజ్యం)	76,265
పరిశ్రమల వినియోగదారులు	2501
కేటగిరి-4	15446
వ్యవసాయ/ఆక్వా	25,347
హెచ్‌టీ కనెక్షన్‌లు	640
మొత్తం	7,78,682 కనెక్షన్లు

జిల్లాలో అన్ని కేటగిరిలు కలిపి సుమారు 200 మిలియన్ యూనిట్లు వినియోగిస్తుంటే బిల్లులు డిమాండ్ రూ. 141 కోట్లుగా ఉంది.

- గత నెల, ఈ నెల వచ్చిన విద్యుత్ బిల్లులు చూసి.. కాకినాడ టూటౌన్ పోలీసు స్టేషన్ సమీపాన ముగ్గురు సభ్యులున్న ఓ చిన్న కుటుంబం షాక్ తింది. గత నెలలో 113 యూనిట్ల విద్యుత్ వినియోగానికి వచ్చిన బిల్లు రూ.457. ఈ నెలలో వినియోగించిన యూనిట్లు 103. అంటే గత నెలతో పోలిస్తే ఈ నెలలో వినియోగం 10 యూనిట్లు తగ్గింది. కానీ, ఏపీ ఈపీడీసీఎల్ నుంచి వచ్చిన బిల్లు రూ.752. పది యూనిట్ల వినియోగం తగ్గినా.. కూటమి ప్రభుత్వం రూ.295 అదనంగా బాదేసింది.
- అదే ప్రాంతానికి చెందిన మరో సామాన్య వినియోగదారుడిదీ దాదాపు ఇదే పరిస్థితి. గత నెలలో ఈ వినియోగదారుడు 175 యూనిట్ల విద్యుత్ వినియోగించగా రూ.858 బిల్లు వచ్చింది. ఈ నెలలో 205 యూనిట్లు వినియోగించగా, బిల్లు ఏకంగా రూ.1,191 వచ్చింది. గత నెలతో పోలిస్తే కేవలం 30 యూనిట్లు అదనంగా వినియోగించిన పాపానికి అతడికి రూ.340 అదనంగా బాదేశారు.
- కాకినాడ గొడారిగుంట లక్ష్మీ హాస్పిటల్ సమీపాన మరో వినియోగదారుడు ఈ నెలలో 140 యూనిట్ల విద్యుత్ వినియోగించగా రూ.886 బిల్లు వచ్చింది. ఫిక్స్‌డ్ చార్జీ రూ.20, కస్టమర్ చార్జీ రూ.50, ఈడీ చార్జెస్ రూ.8.40, ఎఫ్‌పీపీసీఏ చార్జి రూ.99.89, ఎఫ్‌పీపీ చార్జీ రూ.74 కలిసి రూ.250 పైగా అదనపు భారం మోపారు. ఇలా అదనంగా బాదేసి, రూ.127 ప్రభుత్వ రాయితీగా తగ్గించడం గమనార్హం.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను బుట్టలో వేసుకునేందుకు విద్యుత్ చార్జీలు ఒక్క పైసా కూడా పెంచేది లేదని కూటమి నేతలైన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఊరూవాడా ఊదరగొట్టారు. కోతలు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తామని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పక్కాగా అమలు చేసి తీరతామని గొప్పగా డప్పేశారు. తీరా చూస్తే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ వినియోగదారులపై చార్జీల మోత మోగిపోతోంది. ఏ ఇంట.. ఏ వినియోగదారుడిని కదిపినా విద్యుత్ భారాలు పడుతున్నాయని గొల్లుమంటున్నారు.

రూ.1,180 బిల్లు



నాకు గతంలో నెలకు ఐదారు వందల రూపాయల విద్యుత్ బిల్లు వచ్చేది. ఈ నెలలో ఏకంగా రూ.1,180 వచ్చింది. ఒక్కసారిగా రూ.500 అదనంగా రావడంతో ఆర్థిక భారం బాగా పెరిగింది. కూటమి ప్రభుత్వం విద్యుత్ బిల్లులు భారీగా పెంచింది.

– బొద్దు చిన్న, ఉత్తరకంచి, ప్రత్తిపాడు రూరల్

ఇంత బిల్లు ఎలా కట్టాలి?



గతంలో నాకు కరెంటు బిల్లు రూ.350 వచ్చేది. ఇప్పుడు రూ.1,100 వచ్చింది. ఇప్పటికే సరైన ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్నాను. ఈ పరిస్థితుల్లో ఇంత బిల్లు వస్తే ఎలా కట్టాలి?

– మోటూరి సూరిబాబు, వీకే రాయపురం, సామర్లకోట మండలం

'పోరుబాట'ను విజయవంతం చేయండి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తాం, మీపై ఎటువంటి భారం ఉండదంటూ ఎన్నికల సమయంలో ప్రసంగాలు చేశారు. ఇప్పుడు ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారు. విద్యుత్ బిల్లులు భారీగా పెంచేయడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ చార్జీల బాదుడుకు వ్యతిరేకంగా ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నిర్వహిస్తున్న 'పోరుబాట' కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలి.

– కురసాల కన్నబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ

ప్రజలపై భారం మోపడం దుర్మార్గం



అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని కూటమి నేతలు ఎన్నికల సమయంలో చెప్పారు. నేడు ఆ మాట తప్పి సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై కోట్లాది రూపాలయ భారం మోపడం దుర్మార్గం. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా ఇంత పెద్ద మొత్తంలో భారం వేయడం విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నిబంధనలకు విరుద్ధం. నిత్యావసర సరకుల ధరలు, విద్య, వైద్య ఖర్చులు విపరీతంగా పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ భారాలు మోపడాన్ని ప్రజలు వ్యతిరేకించాలి.

– పలివెల వీరబాబు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, కాకినాడ

అదనపు భారం రూ.574



కిర్లంపూడి ఏనుగు వీధి సెంటర్‌లో పండ్ల దుకాణం నిర్వహించుకుంటున్నాను. వ్యాపారంలో వచ్చిన చాలీచాలని డబ్బులతోనే షాపు అద్దె, కరెంటు బిల్లు చెల్లిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ప్రతి నెలా నాకు రూ.250 నుంచి రూ.318 మధ్య కరెంటు బిల్లు వచ్చేది. ఈ నెలలో రూ.892 బిల్లు వచ్చింది. ఒక్కసారిగా రూ.574 అదనంగా భారం పడింది. రానున్న రోజుల్లో ఇలాగే కరెంట్ బిల్లుల భారం పడితే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– కురుమళ్ల చిన్ని, పండ్ల వ్యాపారి, కిర్లంపూడి

గత నెల, ఈ నెల వచ్చిన బిల్లులు పోల్చి చూస్తున్న వినియోగదారుల గుండెలు గుభేల్మంటున్నాయి. ప్రస్తుతం శీతాకాలం కావడం, దీనికి తోడు తరచుగా అల్పపీడనాలు ఏర్పడి, అడపాదడపా వర్షాలు కురుస్తూండటంతో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో మూడు వారాలుగా విద్యుత్ వినియోగం కాస్త తగ్గింది. ఏసీలు, ఫ్యాన్లు పెద్దగా వేయాల్సిన అవసరం ఉండటం లేదు. అయినప్పటికీ గత నెలతో పోలిస్తే ఈ నెలలో సామాన్యుల నుంచి సంపన్న వర్గాల వరకూ దాదాపు అందరి విద్యుత్ బిల్లుల్లో పెరుగుదలే కనిపిస్తోంది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి వినియోగదారుపై యూనిట్‌కు 60 పైసల మేర కూటమి సర్కార్ బాదేస్తోంది. మరో నాలుగు నెలలు గడిచాక ఎండలు ముదిరితే.. ఇప్పుడున్న చార్జీలు మూడింతలు పెరగడం ఖాయంగా కనిపిస్తోందని పలువురు ఆందోళన చెందుతున్నారు. నమ్మించి ఓట్లు వేయించుకున్న కూటమి ప్రభుత్వం.. గద్దెనెక్కాక విద్యుత్ చార్జీలు పెంచుతూ మోసం చేసిందని వినియోగదారులు దుయ్యబడుతున్నారు.

రాష్ట్రంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.6,072.86 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీల వసూళ్లకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ పచ్చజెండా ఊపింది. వినియోగించిన విద్యుత్‌ను బట్టి 2026 జనవరి వరకూ యూనిట్‌కు 60 పైసలు అదనంగా వసూలు చేసేందుకు ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వినియోగదార్లను సర్దు'పోటు' పొడుస్తోంది. ఇప్పటికే విద్యుత్ చార్జీల పెంపుతో సతమతమవుతున్న ప్రజలు.. ఇదే సమయంలో మరింత భారం మోపడంపై మండిపడుతున్నారు. పల్లెలు, పట్టణం అనే తేడా లేకుండా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ఒకే విధంగా విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయి. ఎప్పుడో వినియోగించిన విద్యుత్‌కు ఇప్పుడు అదనపు బాదుడు బాదడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను కూటమి నేతలు తప్పారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీలపై సర్కారు కక్ష!

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 200 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ అందించారు. దీనిపై కూటమి సర్కార్ కక్ష బూనిందని జగ్గంపేట, గండేపల్లి, తొండంగి తదితర మండలాల్లోని ఎస్సీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత బకాయిలున్నాయంటూ ఆయా ప్రాంతాల్లో నోటీసులు ఇవ్వకుండానే విద్యుత్ శాఖ అధికారులు ఇటీవల మీటర్లు తొలగించేందుకు చేసిన ప్రయత్నాలు వివాదాస్పదమయ్యాయి.

విద్యుత్ చార్జీలపై నేడు నిరసనలు

సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పి, విద్యుత్ చార్జీలు పెంచిన కూటమి సర్కార్ కళ్లు తెరిపించేలా వైఎస్సార్ సీపీ శుక్రవారం పోరుబాట పట్టనుంది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఆందోళనలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. ఆయా నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ప్రజలను భాగస్వాములను చేసుకుని, భారీ ర్యాలీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యాన పార్టీ నాయకులు, కార్యకర్తలు కాకినాడ సిటీ పార్టీ కార్యాలయం నుంచి వాటర్ వర్క్స్‌లో ఉన్న ఏపీ ఈపీడీసీఎల్ ఎస్‌ఈ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించనున్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని వినతి పత్రాలు అందించనున్నారు.
- మాజీ మంత్రి, పార్టీ తుని కోఆర్డినేటర్ దాడిశెట్టి రాజా ఆధ్వర్యాన తుని శ్రీరామా సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి గొల్ల అప్పారావు సెంటర్ మీదుగా వీరవరపుపేట వరకూ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం తుని సబ్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేస్తారు.
- పార్టీ పెద్దాపురం కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆధ్వర్యాన సామర్లకోట ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పార్టీ కార్యాలయం నుంచి బ్రౌన్ పేటలోని ఏపీ ఈపీడీఎల్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, నిరసన తెలపనున్నారు.
- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యాన కిర్లంపూడి నుంచి ప్రత్తిపాడు విద్యుత్ సబ్ స్టేషన్ వరకూ పాదయాత్ర నిర్వహించనున్నారు.
- పార్టీ జగ్గంపేట కోఆర్డినేటర్ తోట నరసింహం ఆధ్వర్యాన మెయిన్ రోడ్డు మీదుగా విద్యుత్ సబ్‌స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించి, డీఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేయనున్నారు.
- పిఠాపురంలోని పార్టీ కార్యాలయం నుంచి సబ్‌స్టేషన్ వరకూ మాజీ ఎంపీ, నియోజకవర్గ కోఆర్డినేటర్ వంగా గీత ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించి, ఏడీకి వినతిపత్రం అందజేస్తారు.

ఎమ్మెల్యే ఇంటి ముందు జీడిపిక్కల కార్మికుల బైఠాయింపు



ఎమ్మెల్యే సత్యప్రభ ఇంటి వద్ద బైఠాయించిన జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు

ప్రత్తిపాడు: తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నివాసం వద్ద గురువారం సుమారు 3 గంటల పాటు బైఠాయించారు. తాము 41 రోజులుగా కార్మికులు పోరాడుతున్నా అటు ఫ్యాక్టరీ యాజమాన్యం కానీ, ఇటు ప్రజాప్రతినిధులు కానీ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ, కార్మికులు రోడ్డున పడితే నాయకులు స్పందించకపోవడం సరికాదని అన్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేక పర్యాయాలు వినతులు అందజేసినా పట్టించుకోలేదని విమర్శించారు. మూసివేసిన ఫ్యాక్టరీని వెంటనే తెరిపించి, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరిగేంత వరకూ ఉద్యమం కొనసాగిస్తామని ఈశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ, కార్మికులు ధర్నా చేయడం సరికాదని అన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



మహేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తాళ్లపూడి: రాష్ట్ర స్థాయి అండర్–19 కబడ్డీ పోటీలకు మండలంలోని వేగేశ్వరపురానికి చెందిన దూపాని మహేష్ ఎంపికయ్యాడు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న అతడు ఈ నెల 24న జంగారెడ్డిగూడెం మండలం కామవరపుకోటలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపాడు. తద్వారా వచ్చే నెల 3 నుంచి కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కబడ్డీలో గత ఏడాది వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి కూడా స్టేట్ మీట్‌కు ఎంపికై , పతకం సాధించాడు. మహేష్‌ను స్థానిక కరిబండి కళాశాల డైరెక్టర్ కరిబండి త్రినాథస్వామి, ప్రిన్సిపాల్ పి.మురళి, వైస్ ప్రిన్సిపాల్ డి.మాధవరావు, అధ్యాపకులు అభినందించారు.

టీటీడీసీలో రేపు జాబ్ మేళా



సామర్లకోట: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ – డీఆర్‌డీఏ ఆధ్వర్యాన స్థానిక సాంకేతిక శిక్షణాభివృద్ధి కేంద్రం(టీటీడీసీ)లో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. జిల్లా జాబ్స్ కోఆర్డినేటర్ శివ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఏపీత్రోయ ఫార్మా సంస్థలో 100 ప్రొడక్షన్ అసిస్టెంట్ ఉద్యోగాలకు పదో తరగతి నుంచి డిగ్రీ అర్హత కలిగి, 18 నుంచి 30 సంవత్సరాల్లోపు యువకులు అర్హులన్నారు. వీరికి రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకూ జీతం చెల్లిస్తారని వివరించారు. ఎంపికైన వారు అనకాపల్లి జిల్లా పరవాడలో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా లిమిటెడ్‌లో 40 అసోసియేట్ ఉద్యోగాలకు బీఎస్సీ, డిప్లొమా చదివి, 19–26 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలు అర్హులని తెలిపారు. వీరికి రూ.17,600 నుంచి రూ.19,600 వరకూ జీతం చెల్లిస్తారని, ఎంపికైన వారు శ్రీసిటీలో పని చేయాలని వివరించారు. అలాగే, పెద్దాపురం మండలం జి.రాగంపేటలోని బ్లూటషన్ బయోటెక్ కంపెనీలో 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ ఫిట్టర్, డీజిల్ మెకానిక్ అర్హతతో 25 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటికి 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు వారు అర్హులని, ఎంపికై న వారికి సామర్థ్యాన్ని బట్టి జీతం ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక టీటీడీసీకి వచ్చి, పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. అభ్యర్థులు బయోడేటా, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకు రావాలని శివ తెలిపారు. పూర్తి వివరాలకు శివను 94407 56250, డీపీఓ శ్యామ్‌ను 99491 56583 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎన్నాళ్లో.. నిరీక్షణ!

- కాకినాడ బీచ్‌లో రూ.9.03 కోట్లతో యుద్ధ విమాన మ్యూజియం ఏర్పాటు
- గత సీఎం జగన్ ప్రత్యేక చొరవతో యుద్ధ విమానం కేటాయింపు
- యువతకు స్ఫూర్తినిచ్చేలా పార్కు నిర్మాణం
- ప్రారంభించి నెలలు గడుస్తున్నా సందర్శకులకు నో ఎంట్రీ



సూర్యారావుపేట బీచ్ పార్కులో ఏర్పాటు చేసిన యుద్ధ విమాన మ్యూజియం



బీచ్ పార్కు ముఖ ద్వారం పనులు

కాకినాడ రూరల్: పండగలు, సెలవు రోజుల్లో వేలాదిగా, నిత్యం వందలాదిగా జనం కాకినాడ బీచ్‌కు వస్తూంటారు. వారిని ఆకర్షించేందుకు పది నెలల కిందట ఇక్కడ ప్రారంభించిన యుద్ధ విమాన మ్యూజియాన్ని సందర్శనకు కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) అధికారులు ఎప్పుడు అనుమతిస్తారా అని పలువురు ఎదురు చూస్తున్నారు.

జిల్లా కేంద్రమైన కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట గ్రామంలోని న్యూ ఎన్టీఆర్ బీచ్‌లో టీయూ–142ఎం యుద్ధ విమానంతో ఈ మ్యూజియం ఏర్పాటు చేశారు. వినోదంతో పాటు త్రివిధ దళాల్లో చేరే యువతకు స్ఫూర్తిని పంచే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో కేంద్రం ఈ యుద్ధ విమానాన్ని మన రాష్ట్రానికి కేటాయించింది. విశాఖ బీచ్‌లో మాదిరిగా కాకినాడ బీచ్‌లో కూడా అప్పటి గోదావరి నగరాభివృద్ధి సంస్థ(గుడా) ఆధ్వర్యాన సూర్యారావుపేట బీచ్‌లో రూ.9.03 కోట్లతో థీమ్ పార్కు నిర్మించారు. ఇందులో 53 మీటర్ల పొడవు, 50 మీటర్ల వెడల్పు, 12 మీటర్ల ఎత్తుతో 150 టన్నుల బరువు కలిగిన యుద్ధ విమానాన్ని ఏర్పాటు చేశారు. దీనిని విడిభాగాలుగా తమిళనాడు నుంచి వాహనాల్లో తీసుకువచ్చి, బీచ్‌లో మ్యూజియంగా తీర్చిదిద్దేందుకు రూ.6 కోట్ల వరకూ ఖర్చు చేశారు. బీచ్ పార్కు అభివృద్ధి, రోడ్లు, ముఖ ద్వారం, గార్డెన్, లైటింగ్, గ్రీనరీ వంటి వాటికి మిగిలిన సొమ్ము కేటాయించారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి, అప్పటి స్థానిక ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి నిరంతర పర్యవేక్షణతో ఈ పనులు పూర్తి చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 26న యుద్ధ విమాన మ్యూజియాన్ని అప్పటి కాకినాడ రూరల్, సిటీ ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎంపీ వంగా గీత, తూర్పు నావికాదళ కమాండెంట్ ఎస్.సుదీప్ తదితరులు ప్రారంభించారు. ఈ మ్యూజియం ప్రారంభోత్సవం పూర్తయి దాదాపు 10 నెలలు గడుస్తున్నా సందర్శకులను మాత్రం ఇప్పటికీ అనుమతించడం లేదు. ఇక్కడ పిల్లలకు ఆహ్లాదాన్ని పంచే క్రీడా పరికరాలతో పాటు సందర్శకులకు టాయ్‌లెట్లు, డ్రెస్ చేంజింగ్ రూముల వంటి పనులు చేయాల్సి ఉంది. వీటిని త్వరితగతిన పూర్తి చేసి, క్రిస్మస్, సంక్రాంతి పర్వదినాలనాటికి అందుబాటులోకి తీసుకుని రావాలని అధికారులు భావిస్తున్నా కార్యరూపం దాల్చడం లేదు. కౌడా వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఇటీవల బీచ్ పార్కును సందర్శించి, అసంపూర్తిగా ఉన్న పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె సూచనల మేరకు ప్రస్తుతం పనులు వేగవంగమయ్యాయి. పనులు త్వరిగతిన పూర్తి చేసి, కొత్త సంవత్సరం, సంక్రాంతి పండగలకు వచ్చే సందర్శకులకు యుద్ధ విమాన మ్యూజియాన్ని అందుబాటులోకి తీసుకుని రావాలని పలువురు కోరుతున్నారు.

ఎవరా పెద్దాయన?

- కోడి పందేల బరుల కోసం పైరవీలు
- ఆయనకు రూ.10 లక్షలు ఇచ్చుకోవాలన్న ఆడియో హల్‌చల్
- రామచంద్రపురం బరులపై రౌడీషీటర్ గుత్తాధిపత్యం



కోడిపందేల బరి (ఫైల్)



రామచంద్రపురం: సంక్రాంతి నెల గంట మోగిందో లేదో అప్పుడే కోడిపందేల బరుల హడావుడి మొదలైంది. ఎవరు ఎక్కడ కోడి బరులు వేసుకోవాలనే దానిపై కూటమి నేతలు వాటాలు వేసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. కాకినాడ జిల్లా కరప మండలం విజయరాయుడుపాలెంలో కోడిపందేల బరి కోసం ఇద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ చర్చకు దారి తీసింది. 'కాకినాడ రూరల్ ఎమ్మెల్యేకు ఇప్పుడే రూ.10 లక్షలు ఇచ్చి వచ్చాను. ఇక్కడ పెద్దాయనకు కూడా రూ.10 లక్షలు ఇవ్వాల్సిందే' అంటూ సాగిన సంభాషణ చర్చనీయాంశమైంది. రామచంద్రపురం నియోజకవర్గంతో పాటు కాకినాడ రూరల్ నియోజకవర్గంలో రెండు రోజులుగా సోషల్ మీడియా గ్రూపుల్లో ఈ సంభాషణ హల్‌చల్ చేస్తోంది. కోడి పందేల బరుల్లో ఎలా వాటాలు పంచుకోవాలనే దానిపై జరుగుతున్న ప్రయత్నాలకు ఇది అద్దం పడుతోంది. కోడి పందేల బరులను అమ్మకాలకు పెట్టి మధ్యవర్తుల ద్వారా బేరసారాలు సాగిస్తున్నారు. ఎక్కడ కోడి పందేలు వేయాలి, ఎవరి అనుగ్రహం పొందాలి, ఎంతెంత సమర్పించుకోవాలనే దానిపై నియోజకవర్గానికి చెందిన ఒక పెద్దాయన ఇప్పటికే ఒక టీమ్‌ను ఏర్పాటు చేసినట్టు గుసగుసలాడుకుంటున్నారు.

గతంలో ఇలా..

వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కోడి పందేల నిర్వహణను పూర్తిగా వ్యతిరేకించి సంక్రాంతికి రెండేళ్ల పాటు రామచంద్రపురం నియోజకవర్గంలో నిషేధించారు. నియోజకవర్గంలో ఎక్కడా కోడి పందేల బరులు ఏర్పాటు చేయనివ్వలేదు. సంప్రదాయబద్ధంగా సాంస్కృతిక కార్యక్రమాలతో మూడు రోజులపాటు పండుగ సంబరాలను నిర్వహించారు. దానికి పూర్తి విరుద్ధంగా 20 రోజుల ముందుగానే కోడి పందేల బరుల కోసం పైరవీలు చేయడం శోచనీయమని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పెద్దాయన రూ.10 లక్షలు అడిగారని సోషల్ మీడియాలో వచ్చిన ఆడియో ఆసక్తికరంగా మారింది. ఎవరీ పెద్దాయన! అంటూ ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు. ఓ రౌడీషీటర్ నియోజకవర్గంలోని మొత్తం బరులపై గుత్తాధిపత్యం చెలాయిస్తున్నట్టు కోడి పందేల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ రౌడీషీటర్ పెద్దాయనతో మాట్లాడుకుని వ్యవహారాన్ని చక్కబెడుతున్నాడా..? లేక తనే సొంతంగా బరుల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నాడా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పెద్దాయనకు వాటాలు ఇవ్వడంతోపాటు మొత్తం మీద కోడి పందేల నిర్వహణదారుల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. అందరికీ ఇలా ఇచ్చుకుంటూ పోతే మాకేం మిగులుతుందని పందేల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, ఆ రౌడీషీటర్ చేస్తున్న నిర్వాకానికి పెద్దాయన ఎలా వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తాళ్లపూడి: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన వేగేశ్వరపురంలో చోటు చేసుకుంది. తాళ్లపూడి ఎస్సై టి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేగేశ్వరపురం గ్రామానికి చెందిన పడాల శ్రీరామ రామకుమార్ రాము(28) ఈ నెల 16వ తేదీన ఆర్థిక ఇబ్బందుల వల్ల గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇప్పటి వరకు కాకినాడ గవర్నమెంట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్టు తెలిపారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు తాళ్లపూడి ఎస్సై రామకృష్ణ తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోక్సో కేసులో పాస్టర్ అరెస్ట్

11 ఏళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తన

కొవ్వూరు: వాడపల్లి గ్రామానికి చెందిన దేవదాసు కుటుంబరావు అనే పాస్టర్ క్రిస్మస్ సందర్భంగా బుధవారం అదే గ్రామానికి చెందిన 11 ఏళ్ల బాలికతో అసభ్యంగా ప్రవరించారు. క్రిస్మస్ పండగను పురస్కరించుకుని చర్చికి పిలిచే వంకతో పాస్టర్ బాలిక ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఇంటి వద్ద ఎవరు లేకపోవడాన్ని గుర్తించి బాలికను కౌగిలించుకుని ముద్దులు పెట్టి, కామవాంఛతో పలుచోట్ల చేతులు వేసి అసభ్యంగా ప్రవర్తించారని బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. నిందితుడిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు.

మోటారు సైకిలిస్టు మృతి



ఘటనా ప్రదేశంలో రాంబాబు మృతదేహం

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో గురువారం ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొనడంతో మోటారు సైకిలిస్టు మృతి చెందిన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం కాకినాడ రూరల్ మండలం గంగనాపల్లి నుంచి కాకినాడ వెళుతున్న మోటారు సైకిల్‌ను కాకినాడ రోడ్డులోని కోటిపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద కాకినాడ నుంచి సామర్లకోట వైపు వస్తున్న లారీ ఢీ కొనడంతో మోటారు సైకిలిస్టు కునా రాంబాబు (55) అక్కడికక్కడే మృతి చెందాడు. గంగనాపల్లికి చెందిన మృతుడు తాపీ పని చేసుకొంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మృతునికి ఇద్దరు అబ్బాయిలు ఉన్నారని చెప్పారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించి సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం తాగిన వ్యక్తి మృతి



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన అపరిచిత వ్యక్తి

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం సమీపంలోని ఈదరపల్లి రోడ్డులో 30 ఏళ్ల ఓ అపరిచిత అతిగా మద్యం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈదరపల్లిలో రోడ్డులో పాడుపడిన ఓ సినిమా థియేటర్ వద్ద మద్యం మితిమీరి సేవించి ఆ వ్యక్తి తన పేరు, ఊరు చెప్పే స్థితిలో కూడా లేకుండా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో స్థానికులు అతడిని మధ్యాహ్నం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి అతడిని మామూలు స్థితిలోకి తీసుకుని వచ్చేందుకు వైద్యులు శ్రమించారు. చివరకు అతడు సాయంత్రం మృతి చెందినట్లు పట్టణ ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు. మితిమీరి మద్యం సేవించడంతో పాటు అతడికి వేరే రుగ్మత ఏమైనా ఉండడం వల్లే చనిపోయాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మాసిన దుస్తులతో ఉన్న ఆ వ్యక్తి ఎక్కడ నుంచో ఇక్కడకు వచ్చినట్లు తెలుస్తోంది. ఏదైనా పని నిమిత్తం ఈ ప్రాంతానికి వచ్చాడా లేదా మరేదైనా కారణంతో గతి తప్పి ఇక్కడకు వచ్చాడా...? అనే దిశగా విచారిస్తున్నారు. ఆ అపరిచిత వ్యక్తి మృతదేహాన్ని కుటుంబీకులు, బంధువులు, తెలుసున్నవారు గుర్తిస్తే పట్టణ పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై కిషోర్‌బాబు సూచించారు. మృతదేహం సమాచారాన్ని 8143579127 ఫోన్ నెంబర్‌కు అందించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతానికి ఆ మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉంచినట్లు చెప్పారు.

ఆర్థిక ప్రమాణాల పెంపునకు కృషి

జాతీయ రైతు దినోత్సవంలో సీటీఆర్ఐ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ సరళ



ఉత్తమ రైతులను సత్కరించిన ఐసీఏఆర్-సీటీఆర్ఐ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ సరళ, తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పొగాకు రైతుల సామాజిక, ఆర్థిక ప్రమాణాల మెరుగుదలకు తమ సంస్థ కృషి చేస్తోందని ఐసీఏఆర్-సీటీఆర్ఐ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ కె.సరళ అన్నారు. స్థానిక కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ(సీటీఆర్ఐ)లో గురువారం జాతీయ రైతు దినోత్సవం (కిసాన్ దివస్) నిర్వహించారు. అధ్యక్షత వహించిన డాక్టర్ సరళ మాట్లాడుతూ పర్యావరణ అనుకూలిత స్వచ్ఛమైన పొలం (స్వచ్ఛ ఖేతి/క్లీన్ ఫార్మ్ కాన్సెప్ట్)ను సాధించే దిశగా ఆచరణాత్మక పరిష్కారాలు, అత్యుత్తమ విధానాలపై రైతులు దృష్టి సారించేలా కిసాన్ దివస్ నిర్వహించామన్నారు. పొగాకు దిగుబడులను హెక్టారుకు 3,000 కిలోల స్థాయి నుంచి పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. పంట యాజమాన్యంలో తలెత్తే సమస్యలు, ఇతర అంశాలపై సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు తక్షణమే స్పందిస్తారని ఆమె తెలిపారు. స్వచ్ఛభారత్ అభియాన్ నోడల్ అధికారి డాక్టర్ కె.సుమన్ కళ్యాణి కిసాన్ దివస్ ప్రాముఖ్యతను వివరించారు. పోస్ట్ హార్వెస్ట్ అండ్ వాల్యూ అడిషన్ విభాగాధిపతి డాక్టర్ ఎల్ కే ప్రసాద్ మాట్లాడుతూ పొగాకు ఎక్కువగా పురుగుమందులపై ఆధారపడే పంట కాబట్టి జీఆర్ఎల్ కంటే తక్కువ అవశేషాలతో ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. పీఎంఈ సెల్ నోడల్ అధికారి డాక్టర్ కస్తూరి కృష్ణ మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రభుత్వం ఈ విషయంలో రైతులను ఆదుకోవాలని తెలిపారు. అభ్యుదయ రైతులు సత్రం వెంకటరావు, ఇల్లూరి రాంబాబు వారి అనుభవాలను పొగాకు శాస్త్రవేత్తలతో పంచుకున్నారు. తమ ఎంఎల్ఎస్ నేలలకు నికోటిన్ అధిక స్థాయిలో ఉన్న మంచి అధిక దిగుబడినిచ్చే మేలిరకం పొగాకును అభివృద్ధి పరచవలసిందిగా వారు శాస్త్రవేత్తలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులు సత్రం వెంకటరావు (చల్లావారి గూడెం)- జంగారెడ్డిగూడెం ఏపీఎఫ్-2, ఇల్లూరి రాంబాబు (వెల్లచింతలగూడెం) గోపాలపురం ఏపీఎఫ్, నులకాని సుబ్రహ్మణ్యం (అక్కంపేట)- జంగారెడ్డిగూడెం-1 ఏపీఎఫ్, కోయ వెంకటేశ్వరరావు (వెలచింతలగూడెం)- గోపాలపురం ఏపీఎఫ్, ఎస్.రాంబాబు (మైసన్నగూడెం)లను సత్కరించారు.

కాలువలో మునిగి చిన్నారి మృతి



బల్లిపాడులో బాలుడి ఇంటి సమీపంలో ప్రవహిస్తున్న కాలువ



బల్లిపాడులో కాలువలో పడి మృతి చెందిన నాలుగేళ్ల బాలుడు

బల్లిపాడులో విషాదం

తాళ్లపూడి : ఆడుకుంటూ కాలువలో పడి నీట మునిగి నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన బల్లిపాడులో గురువారం చోటు చేసుకుంది. తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బల్లిపాడు ఎస్సీలు నివసించే ప్రాంతంలో గల తలపాకుల జాన్సీ రాణి నాలుగేళ్ల కుమారుడు ఆద్విత్‌కుమార్ ఆడుకుంటూ ఇంటి సమీపంలోని కాలువలో పడి మునిగిపోయాడు. ఎవరూ చూడకపోవడంతో మునిగిన వెంటనే మృతి చెందాడు. ఈ ప్రాంతంలో వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం పంట కాలువ నీరు దాదాపు గట్టుకు సమాంతరంగా వెళుతూ ఉంటుంది. ఆడుకుంటూ వెళ్లి కాలువ నీటిలో ప్రమాదవశాత్తూ పడి మునిగిపోయి తన చిన్నారి మృతి చెందాడని బాలుడి తల్లి తలపాకుల జాన్సీరాణి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఘటనా ప్రదేశానికి పోలీసులు చేరుకుని వివరాలను సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు.

పాత నేరస్తులపై నిఘా

- డ్రోన్ల సహాయంతో గంజాయిపై ప్రత్యేక దృష్టి
- శలపాక, వేట్లపాలెంలో హత్యలు దురదృష్టకరం
- ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్



కాకినాడ రూరల్ సర్కిల్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్

కాకినాడ రూరల్: పాత నేరస్తులపై నిరంతరం నిఘా పెడుతున్నామని దీనివల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం సర్పవరం జంక్షన్ వద్ద రూరల్ సర్కిల్ పోలీసు కార్యాలయంలో రికార్డులను ఆయన తనిఖీ చేశారు. పలు కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించి వాటి దర్యాప్తు, తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఐజీ అశోక్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ గంజాయి రవాణా అరికట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. డ్రోన్ల సహాయంతో గంజాయి సమాచారం సేకరించి చర్యలు చేపడుతున్నామని, ఈ మధ్యకాలంలో గంజాయి నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. మహిళలపై నేరాల అదుపునకు ప్రత్యేక దృష్టి పెట్టామని, చిన్న పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి వారికి త్వరగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరగాళ్లు భయపెడుతున్నారన్నారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు ప్రజలు వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 19000కి మూడు గంటల లోపు సమాచారం ఇవ్వాలన్నారు. కాకినాడ జిల్లాలో కాజులూరు మండలం శలపాక, సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన హత్యలు దురదృష్టకరమన్నారు. వ్యక్తిగత తగాదాల కారణంగా రెండు చోట్ల జరిగిన హత్యల నేపథ్యంలో గ్రామాలలో జరిగే చిన్న చిన్న గొడవలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించామన్నారు. డీఐజీతో పాటు ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ట్రైనీ ఏఎస్పీ సుష్మిత, కాకినాడ ఇన్‌చార్జి డీఎస్పీ రామచంద్రరావు, సీఐ చైతన్యకృష్ణ, వివిధ పోలీసు స్టేషన్ల ఎస్సైలు ఉన్నారు.

హెల్మెట్ వినియోగంపై చైతన్య యాత్ర

రాజానగరం: బైకులపై ప్రయాణించే వారే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రమాదాలలో తలకు గాయం తగలడంతోనే ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బైకులపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోర్టుల ఆదేశాలతో పోలీసుశాఖ, రవాణా శాఖ తరచు అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. తమ వంతు బాధ్యతగా హైదరాబాద్‌కి చెందిన డాక్టర్ వెంకట్ కోసూరి, డాక్టర్ నరేష్ పిన్నింటి, వంశీ బరిగే, కృష్ణచైతన్య కరణం, శ్రీకృష్ణ బాలాంత్రపు, డేనిల్ బెన్ని (ఇద్దరు వైద్యులు, నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు) హెల్మెట్ వినియోగంపై ప్రచారం నిర్వహించి, ప్రజలలో చైతన్యం తీసుకురావాలనే ఆలోచనతో హైదరాబాద్ టు కాకినాడ, కాకినాడ టు హైదరాబాద్‌కు తొమ్మిది రోజుల బైకు యాత్రను చేపట్టారు. కాకినాడకు చేరుకుని, తిరిగి వెళ్లే క్రమంలో దివాన్‌చెరువులో కలిసిన స్థానిక మీడియాకు డాక్టర్ నరేష్ పిన్నింటి యాత్ర వివరాలను తెలియజేశారు. బైకులపై ఈనెల 21న హైదరాబాద్ నుంచి బయలుదేరి విజయవాడ, మచిలీపట్నం, దిండి, రావులపాలెం, అమలాపురం, యానాం, కాకినాడ వెళ్లి తిరిగి రాజానగరం, రాజమహేంద్రవరం, భీమవరం, బాపట్ల మీదుగా 29 నాటికి హైదరాబాద్‌కి చేరుకుంటామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అనేక రోడ్డు ప్రమాదాలలో బైకులపై ప్రయాణించే వారే ఎక్కువగా బలైపోతున్నారన్నారు. తలకు హెల్మెట్, చేతులకు గ్లౌజ్, జాకెట్ వేసుకోవడం వల్ల ప్రమాదాల నుంచి చాలావరకు తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై ప్రజలలో చైతన్యం తీసుకురావడంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకృతి అందాలను కూడా ఆస్వాదించే విధంగా తమ యాత్ర సాగుతోందన్నారు. ఈ యాత్రను యావత్తూ చిత్రీకరించే విధంగా వారు ధరించిన హెల్మెట్‌లకు ప్రత్యేక కెమెరాను ఏర్పాటు చేసుకున్నారు.



బైకు యాత్ర చేస్తున్న హైదరాబాద్ వాసులు



యాత్ర చిత్రీకరణ కోసం డాక్టర్ నరేష్ పిన్నింటి హెల్మెట్‌కి బిగించిన ఉన్న కెమెరా

10 కేజీల గంజాయి పట్టివేత



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీహరిరాజు

ఏలేశ్వరం: మండల పరిధిలోని యర్రవరం జాతీయ రహదారిపై 10 కేజీల గంజాయి పట్టుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు గురువారం విలేకరులకు వివరాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు యర్రవరం జాతీయ రహదారిపై సీపీఎఫ్ కంపెనీ వద్ద కర్ణాటకకు చెందిన నాయజ్‌పాషా కారులో తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. దీంతో పాటు రూ.65వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశామన్నారు. ముద్దాయికి గంజాయి సరఫరా చేసిన ఒడిశా రాష్ట్రానికి చెందిన సమంత కంహార్‌ను అరెస్టు చేయవల్సి ఉందన్నారు. సీఐ సూర్యఅప్పారావు, ఎస్సై రామలింగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అందివచ్చిన కొడుకులు అనంతలోకాలకు..

- అదుపు తప్పి చెట్టును ఢీకొన్న బైక్
- ఇద్దరు యువకుల మృతి
- మృత్యువులోనూ వీడని స్నేహబంధం



ఘటనా స్థలంలో మృతదేహాలను పరిశీలిస్తున్న అన్నవరం ఎస్సై హరిబాబు



వెంకటరమణ పుట్టినరోజు సందర్భంగా కేకు తినిపిస్తున్న సుబ్రహ్మణ్యం (ఫైల్)

శంఖవరం: అందివచ్చిన కొడుకులు తమకు అండగా ఉంటారనుకుంటే రోడ్డు ప్రమాదం వారిని పొట్టన పెట్టుకుందని ఆ తండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. శంఖవరం మండలం పెద మల్లాపురం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. చిన్ననాటి స్నేహితులు ఇద్దరూ ఒకేసారి మరణించడాన్ని కుటుంబీకులు తట్టుకోలేకపోతున్నారు. ఒకే ప్రాంతంలో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగిన వారి స్నేహ బంధం మరణంలోనూ వీడలేదు. మండలంలోని పెద మల్లాపురం గ్రామానికి చెందిన బలుం సుబ్రహ్మణ్యం (24), బోడోజు వెంకటరమణ(18) బుధవారం రాత్రి సమీపంలోని వేళంగి గ్రామానికి బైక్‌పై వెళ్లారు. అక్కడ పని ముగించుకొని తిరిగి బయలు దేరారు. ఇంటికి కూతవేటు దూరంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవ్ చేస్తున్న వెంకటరమణ, వెనుక కూర్చున్న సుబ్రహ్మణ్యం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారాన్ని అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న బలుం సుబ్రహ్మణ్యం గతంలో బాకీ ఉన్న ఆటో కిరాయి సొమ్ము వసూలు చేసుకోవడానికి వేళంగి వెళ్లుతున్నట్లు ఇంటి వద్ద చెప్పి వెళ్లి ప్రమాదానికి గురయ్యాడు. అతని తండ్రి బలుం కన్నయ్య గుండెలు పగిలేలా విలపించాడు. తన పెద్ద కుమారుడికి ఇటీవల వివాహం జరిపించానని, సుబ్రహ్మణ్యానికి వివాహం జరిపించేందుకు సంబంధాలు చూస్తుండగా ఈ ఘోరం జరిగిందని కన్నీరుమున్నీరుగా విలపించాడు. బోడోజు వెంకటరమణ ఇంటర్మీడియెట్ చదువుకున్నాడని, ఉద్యోగం చేసి కుటుంబాన్ని పోషిస్తాడనుకున్నానని, ఇలా అర్ధంతరంగా వెళ్లిపోయాడని తండ్రి బోడోజు రాజు కన్నీటి పర్యంతం అయ్యాడు. సమాచారం అందుకున్న అన్నవరం ఎస్సై హరిబాబు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మృతదేహాలను తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.